


31నే పింఛన్లు పంపిణీ: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం అందించే సెప్టెంబర్ నెల ఫించన్లను ఈనెల 31 (శనివారం) రోజునే పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన 'పేదల సేవలో' కార్యక్రమం కింద పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం కావడంతో ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. సామాజిక పెన్షన్లు ఈనెల 31వ తేదీన అందకపోతే సెప్టెంబర్ 2వ తేదీన (సోమవారం) అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త నిల్వలు

జిల్లాకు జ్వరమొచ్చింది..

పక్క ఫోటోలోని వ్యక్తి పేరు మురళి రెడ్డి. పది రోజుల క్రితం జ్వరం వచ్చింది. కాళ్లు చేతుల్లో వణుకు మొదలైంది. నడవడానికి తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి. స్థానికంగా ఉన్న ఆసుపత్రుల చుట్టూ తిరిగినప్పటికీ ఉపయోగం లేకపోయింది. చేతిలో ఉన్న సొమ్ము 30 వేలు కాస్త ఖర్చయిపోయింది. తెల్ల రక్త కణాలు తగ్గిపోయాయి. మరో వైపు ఆయాసం. ఊపిరి తీసుకోలేని పరిస్థితి.ఈలోపు తీవ్ర అనారోగ్యంతో కదలలేని పరిస్థితుల్లో తిరుపతి రుయాకు వచ్చారు.

ఈ ఫొటోలో వున్న వ్యక్తి పేరు రామచంద్ర. మూడు రోజులుగా జ్వరం వచ్చింది. ఆర్ఎంపి వైద్యుల దగ్గర ట్రీట్మెంట్ తీసుకుంటున్నప్పటికీ జ్వరం తగ్గకపోగా, ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చింది. ఒళ్లంతా తీవ్రమైన నొప్పులు. చేతి వేళ్ళు, కాలి వేళ్ళు, మడమల వద్ద భరించలేనంత నొప్పితో ఆసుపత్రి పాలయ్యారు. ప్రస్తుతం రుయాలో కోలుకుంటున్నారు.



రేణిగుంట సమీపంలోని ఓ ప్రముఖ కంపెనీలో శ్రీనివాసులు అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల నుంచి తనకు జ్వరం ఉందని, సెలవు కావాలని యాజమాన్యాన్ని కోరాడు. కానీ ఉన్నట్టుండి సెలవు అంటే కుదరదు అంటూ మేనేజర్ తెగేసి చెప్పాడు. ఆ జ్వరం తోనే బుధవారం ఉదయం ఫ్యాక్టరీలోకి యథావిధిగా పనికొచ్చాడు. ఒళ్లంతా నొప్పులు వున్నాయని, సహచరులకు చెప్పిన కొంతసేపటికే కళ్ళు తిరిగి కింద పడిపోయాడు. లేవలేని పరిస్థితికి చేరుకున్నాడు. అతని పరిస్థితిని గమనించిన మిత్రులు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, ఇతరత్రా రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు వైరల్ ఫీవర్గా తేల్చారు. ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఇప్పటికీ పాతిక వేలకు పైగా ఖర్చు అయినట్లు తెలుస్తోంది.

- ఉమ్మడి జిల్లాలో 3వేలకు పైగా బాధితులు
- డెంగీ 120, చికున్ గున్యా 74, మలేరియా 6



ఇన్ పేషంట్లుగా జ్వరపీడితులు

ప్రజాశక్తి - తిరుపతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విషజ్వరాలు విజంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో సగటున ఒకరిద్దరికి పైగా జ్వరపీడితులు ఉన్నారు. జూన్ నుంచి రెండు జిల్లా కేంద్రాల్లోని ప్రధాన ఆసుపత్రుల్లో వేలాది మంది చికిత్స కోసం చేరుతున్నారు. ప్రస్తుతం జ్వరం తగ్గక గొంతునొప్పి, దగ్గు, జలుబు లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరుతున్న కొందరిలో రక్తఫలికలు (ప్లేట్లెట్స్) తగ్గుతున్నాయి. ఓవైపు చికున్‌గున్యా, మరోవైపు డెంగీ, ఇంకోవైపు మలేరియా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. వాతావరణ మార్పులు ఒక వైపు.. పారిశుధ్య లోపం మరోవైపు ప్రజలను రోగాలపాలు చేస్తున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రోగులు దవాఖానకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, సిబ్బంది కొరత వేధిస్తుండగా, ప్రైవేటు దవాఖానలకు కాసులు కురిపిస్తూ పేదల జేబులకు చిల్లులు పడుతుండటం గమనార్హం.

డెంగీ డేంజర్ బెల్స్

ఉమ్మడి జిల్లాలో డెంగీ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో అధికారికంగా 736 కేసులు నమోదైనప్పటికి వాస్తవంగా 1200 కి పైగా డెంగీ పాజిటివ్ అని తెలుస్తోంది. ఒక్క తిరుపతి జిల్లాలో అధికారికంగా 201 డెంగీ కేసులు నమోదైనట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొంటున్నారు. మూడు కేసులు డెత్ అయినప్పటికీ గూడూరు ప్రాంతంలోని డక్కిలి, గురుకుల పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి మాత్రమే డెంగీతో చనిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

రుయా, స్విమ్స్‌లో రోజుకి 400 కి పైగా బాధితులు

తిరుపతిలోని రుయా ఆసుపత్రికి రోజుకు సుమారు 150 నుంచి 200 మందికి పైగా జ్వరంతో బాధపడుతున్న వారే వస్తున్నారు. ఇక స్విమ్స్ ఓపి లకు మరో 250 మందికి పైగా జ్వరపీడితులు వస్తున్నట్లు తెలుస్తోంది. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి అంటూ తిరుపతి నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రిల్లో మరో 500 మందికి పైగా జ్వర పిడుతులు ప్రతిరోజూ చికిత్స పొందే పరిస్థితి నెలకొంటుంది. తిరుపతి నగరం, రెడ్డి రెడ్డి కాలనీలోని ఓ ప్రముఖ జ్వరాల డాక్టర్ వద్దకే రోజుకు 90 నుంచి 110 కేసులు వస్తుండటం గమనార్హం. ఇక ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీహెచ్ సి, సి హెచ్ సి లు, ఏరియా , ప్రధాన ఆసుపత్రుల్లో రోజుకి సుమారు 3 వేల మందికి పైగా ప్రతిరోజూ జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్య వర్గాలే పేర్కొంటున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిల్లో మందులు కొరత ఉండటంతో ఏ జ్వరం వచ్చినా నాలుగు పారాసిటమాల్ మాత్రలిచ్చి సరిపెడుతున్నారంటూ ప్రజా సంఘాల నేతలు వాపోతుండడం గమనార్హం.

ఫ్రైడే.. డ్రైడే నిర్వహిస్తున్నాం: డాక్టర్ శ్రీహరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి

ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రై డే నిర్వహిస్తున్నాం. సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంటి ఆవరణలో ఉండే పూలతొట్టీలు, డ్రమ్ముల్లోని నీటిని తొలగిస్తున్నాం. మురికి కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం. ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలి. లక్షణాలు కనిపిస్తే ఆందోళన చెందకూడదు. వైద్యులను సంప్రదించాలి. సొంత వైద్యం చేసుకోవద్దు. జ్వరం తీవ్రత మేరకు పరీక్షలు చేయించుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి.

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో...

తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో చెత్త దిబ్బలు గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. రేణిగుంట-చెన్నై జాతీయ రహదారిని కలుపుతూ నిర్మితమౌతున్న రహదారిలో చెత్త గుట్టలు గుట్టలుగా ఉంది. ఇటుగా ప్రయాణించే వాహన దారులు, తిరుపతికి వచ్చే యాత్రికులు ఈ గుట్టలను చూసి నోరెళ్లబెడుతున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి పరిస్థితులు ఏంటో అని విమర్శించుకునే స్థాయికి చెత్త గుట్టలు చేరిపోయాయి. తిరుచానూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఇలా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త గుట్టల కథ తెల్చాల్సి ఉంది.

ఉద్యోగం ఉంటుందా.. ఊడుతుందా.!

- అయోమయంలో ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బంది



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జనాలకి కిక్కెంచే మద్యం విక్రయించే మద్యం షాపు సిబ్బంది జీవితాలు గాల్లోదీపంగా మారాయి. ఉద్యోగం ఉంటుందో.. ఊడుతుందో.. అనే అయోమయంలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. గత రెండు నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. అదనంగా రెండు గంటలు పనిచేయించుకొని బోనస్ ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగానికి ఎసరు వచ్చేలా ఉందంటూ వాపోతున్నారు. చదువుకున్నా ఉద్యోగం రాక కుటుంబపోషణ కోసం మద్యం దుకాణాల్లో అయినా పర్వాలేదు అని ఉద్యోగంలో చేరామని, కొత్త ప్రభుత్వం టెండర్ విధానం తీసుకొస్తున్నట్లు తెలియడంతో కొత్త ఉద్యోగాన్ని వెత్తుకోవడానికి వయసు మీరడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతూ నూతన ప్రభుత్వం తీసుకొచ్చే కొత్త మద్యం పాలసీలో తమనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గత ప్రభుత్వం అప్పటివరకు ఉన్న మద్యం పాలసీని మార్చి ప్రభుత్వమే మద్యం దుకాణాల నిర్వహణ చేపట్టంది. ఇందు కోసం మద్యం దుకాణాలో సెల్స్‌మెన్, సూపర్‌వైజర్స్, సెక్యూటీ గార్డులను నియమించారు. ఇలా చిత్తూరు మద్యం డిపో పరిధిలో 88 మద్యం షాపుల్లో 600లకుపైగా సెల్స్‌మెన్స్, 150 మంది సూపర్‌వైజర్లను నియమించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. ఇలా నియమించిన మద్యం దుకాణం సిబ్బందికి జీత భత్యాతలు, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు బాధ్యతలు థార్డ్ ఐ ఏజేన్సీకి అప్పగించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జూన్, జూలై మాసం జీతాల విషయం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. మరోవైపు ఈఎస్ఐ, పీఎఫ్ పేరుతో సూపర్ వైజరకు ఇచ్చే రూ.28 వేల జీతంలో నెలకు రూ19 వేలు మంత్రమే అందిస్తోంది. అలాగే సెల్స్‌మెన్స్‌కు రూ.24వేలు జీతం ఇవ్వాల్సి ఉంటే రూ.16,500లు మాత్రమే ఇస్తున్నారు. థార్డ్ ఐ ఏజేన్సీ ఎక్కడ ఉందో.. ఎందుకు జీతాలు తగ్గించి చెల్లిస్తున్నారో తెలియని పరిస్థితి. జీతంలో కట్ చేస్తున్న డబ్బులు ఈఎస్ఐ, ఫీఎఫ్‌లో జమ అవుతున్నది లేనిదీ కనీసం ఫీఎఫ్ సిప్లులు కూడా ఇవ్వడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. సెక్యూరిటీలు పనిచేస్తున్న వారికి నెలకు రూ.12,500లు జీతం ఇవ్వాల్సి ఉంటే కటింగ్‌ల పేరుతో రూ.10వేలు మాత్రమే ఇస్తున్నారు. అదనంగా రెండు గంటలు పని చేస్తే సిబ్బందికి బోనస్ ఇస్తామని ప్రకటించినా అతీగతి లేదు. కొత్త ప్రభుత్వం మద్యం పాలసీలో మార్పులు తీసుకొచ్చి టెండర్లకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఉద్యోగాలు కొల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలసీ మారినా తమనే కొనసాగించాలని, రెండు నెలల పెండింగ్ వేతనాలు, బోనస్ అరియర్స్ చెల్లించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో డిగ్రీ ఆపై చదువులు చదివినా ఉద్యోగాలు రాక మద్యం దుకాణాల్లో పని చేసేందుకు సిద్ధపడ్డామని ఇప్పుడు ఉన్నఫలంగా ఉద్యోగాల నుండీ తొలగిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి



గిడుగు రామూర్తి చిత్రపటానికి నివాళ్ళు అర్పిస్తున్న డిఆర్ఓ పుల్లయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలిభాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి పంతులని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్ఓ సమావేశం హల్‌లో డ్వామా పిడి ఎన్.రాజశేఖర్‌తో కలసి గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డిఆర్ఓ మాట్లాడుతూ తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29ని తెలుగు భాషా దినోత్సవంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణించిందని తెలిపారు. గిడుగు తెలుగు వ్యవహారిక భాషకు పితామహుడుగా పరిగణించబడతారని తెలిపారు.



చిత్తూరు బృందావన్ స్కూల్‌లో..

బృందావన్ స్కూల్‌లో.. స్థానిక బృందావన్ స్కూల్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు భువన విజయం, తండ్రిపై అద్భుత ప్రేమ అనే నాటిక ద్వారా తెలుగు కవుల వేషధారణతో తెలుగు భాష గొప్పతనాన్ని తెలుపుతూ తెలుగు భాషకు సంబంధించిన మధుర గీతాలు, నాట్యాలతో అలరించారు. పాఠశాల అధ్యక్షులు విజయభాస్కర్ రావుగారి, వ్యవస్థాపకులు శైలజ, చిరంజీవి పాల్గొన్నారు.

విజయంలో.. స్థానిక సుందరరాజపురంలోని విజయం సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం ఘనంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల అధ్యక్షులు తేజోమూర్తి, కార్యనిర్వహకురాలు శైలజమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని తెలుగు భాష అభివృద్ధి కోసం కృషిచేసిన గిడుగు రామ్మూర్తి గొప్పతనాన్ని తెలియజేయాలన్నారు. వ్యాసరచన వకృత్వ క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.



చిత్తూరు విజయం స్కూల్‌లో..



యాదమరిలో..

యాదమరి మండలం కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో తెలుగుభాషా, క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎపి.లలిత తెలిపారు. వ్యాస రచన, వకృత్వపు, పద్యపఠనలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గణిత ఉపాధ్యాయులు కె.కనకాచారి మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతి అందించారు. భాస్కర్ రెడ్డి, సుల్తాన్, కనకాచారి, మదన్ మోహన్, మధుసూదన్, మహేష్ బాబు, నీలవేణి, మంజుల, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.


గంగాధరనెల్లూరు: తెలుగు భాషా దినోత్సవాన్ని మండలంలోని వివిధ ప్రభుత్వ హైస్కూల్స్‌లో ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థులు టీచర్లు, ఇన్చార్జి హెచ్‌ఎం రాజేంద్ర నాయుడు, అలరించారు. బగారెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ దమయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పలమనేరులో..

పలమనేరు: పలమనేరు పట్టణంలోని లక్ష్మీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి, సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే చైతన్య పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సుభాని ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏజ్. ఎంజి సురేష్, ఆర్‌వి.చక్రధర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కార్వేటినగరం: డీఎం.పురం హెచ్.ఎం కేశవులు ఆధ్వర్యంలో గురువారం పాఠశాల ఆవరణలో ఆధునిక తెలుగుభాష ఉద్యమ వైతాళికుడు గిడుగు రామమూర్తి జయంతి జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం, పరమానందయ్య శిష్యుల కథ, దుర్యోధన ఏకపాత్రాభినయం నాటికలు ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు విద్యార్థులకు భోజనం, బహుమతులు అందించారు. వైస్‌చైర్మన్ సంధ్యారాణి, తెలుగు భాషా ఉపాధ్యాయులు చిన్నయ్య చెట్టి, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం రెడ్డి, వెంకట రమణయ్య పాల్గొన్నారు.



గుడిపల్లి ద్రావిడ వర్శిటీలో..

గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో గురువారం గిడుగు రామూర్తి జయంతిని, తెలుగు భాషా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి మాట్లాడుతూ గిడుగు రామూర్తి తెలుగు భాషకు చేసిన సేవలను మరువలేనివని కొనియాడారు. నాలుగు కూడలి వెలసిన ద్రావిడ విశ్వవిద్యాలయంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, ఆచార్య శ్రవణ్ కుమార్, ఆచార్య హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కవితలు, కథలు, వ్యాసాల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న బహుమతులు ప్రదానం చేశారు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, తెలుగు సఖాధ్యక్షులు డాక్టర్ భీమమోహన రావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం మండల పరిధిలో గల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవంతో పాటు క్రీడా దినోత్సవం నిర్వహించారు. పట్టణ పరిధిలోని సామగుట్టపల్లి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండలంలోని చందం పంచాయితీ కొత్తఇండ్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అలాగే కొత్తఇండ్లు గ్రామంలో విద్యార్థులు గ్రామస్తులకు క్రీడల పై అవగాహన కలిగేలా ర్యాలీ నిర్వహించారు.

బైరెడ్డిపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బైరెడ్డిపల్లి, తీర్థం, నెల్లిపట్ల, కడపనాతం, సిసి.గుంట, లక్కనపల్లి, ఏపీ మోడల్ స్కూల్, గురుకుల, కస్తూర్బా కామ్మనపల్లి పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామూర్తి, క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్‌ను స్మరించుకుని విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.



బైరెడ్డిపల్లిలో..

సదుం : గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వై. జయకుమార్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు బి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషలో కవితలు రాసిన గణిత ఉపాధ్యాయుడు వేణుగోపాల్ రెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు సుధాకర్, రవీంద్రబాబు, నీరజ, ప్రభావతి, రాధా పాల్గొన్నారు.



సదుంలో..

గంగవరం: మండలంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తెలుగు భాషకు ఆయన చేసిన కృషి గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగు సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పలు పాఠశాలల్లోని వంద మంది విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు.




కుప్పంలో..

బంగారుపాళ్యం: తెలుగులో ప్రావీణ్యం సంపాదించాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తుంబపాళ్యం, మంగళపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చిట్టెమ్మ, రాజ్యలక్ష్మి అధ్యాపకులు గిరిబాబు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన వకృత పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



కార్వేటినగరంలో..

సోమల: మండలంలోని సోమల, పెద్ద ఉప్పరపల్లి, నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయ బృందం సాంప్రదాయ వేషధారణలో విధులకు హాజరై జాతీయ నేతల చిత్రపటాలను ప్రదర్శిస్తూ ర్యాలీలు నిర్వహించి తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన సోమలలో ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి వివిధ క్రీడల నమూనాలను ప్రదర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి, ధ్యాన్చంద్ చిత్రపటాలకు పూలమాలవేసి అంజలి ఘటించారు.



సోమలలో..

ప్రజాశక్తి వార్తకు స్పందన

తాగునీటి సమస్య పరిష్కారం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీ పరిధిలోని దాసార్లపల్లి గ్రామంలో బోరు మోటర్లు మరమ్మతులకు గురికావడంతో గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఈసమస్యపై ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురణ కావడంతో ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ వెంటనే స్పందించి నూతన బోరు మోటర్లు బిగించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోదండరెడ్డి, పంచాయతీ సెక్రటరీ సురేష్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



కంటి వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పేదప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని, ఇందులో భాగంగా ఉచిత కంటి వైద్యచికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పురపాలక సంఘం, వైద్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన కంటి చికిత్స శిబిరానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీతో పాటు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగం కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో ఇంటింటి సర్వే నిర్వహించి, కమిటీ సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ఉచిత వైద్యాన్ని అందజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కన్నన్, జిమ్ దాము, వేలు, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, పురపాలక సంఘం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం అభివృద్ధికి సహకరిస్తాం..

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పురపాలక సంఘం అధ్యక్షులు డాక్టర్ సుధీర్ తెలిపారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని పురపాలక సంఘం అధ్యక్షుల ఆధ్వర్యంలో పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా పట్టణ అభివృద్ధికి 61 అంశాలతో కూడిన ప్రణాళికలు కమిషనర్ ప్రవేశపెట్టారు. ఈ ప్రణాళికలోని అంశాలను పరిశీలించిన కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది.

పేద విద్యార్థులకు అండగా సత్య జ్యువెలరీ

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణానికి చెందిన సత్య జ్యువెలరీ అధినేత సత్యరాజ్ పేదవిద్యార్థులకు అండగా నిలవడంపై ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ సత్యరాజ్‌ను అభినందించారు. గురువారం పట్టణంలోని టీవీ రోడ్‌లో సత్య జ్యువెలరీని ఎమ్మెల్సీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా సత్యరాజ్ నోటు పుస్తకాలు, పెన్నులు వంటి విద్యా సామాగ్రిని ఎమ్మెల్సీకి అందజేస్తూ వాటిని పేదవిద్యార్థులకు పంచిపెట్టావలసిందిగా కోరారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన బంగారు, వెండి ఆభరణాలను, స్వచ్ఛమైన కారంగాళి పూసలను అందుబాటులోనికి తేవడం తమ ప్రత్యేకతగా తెలిపారు.

విద్యార్హత పెంచుకోవడానికి సువర్ణవకాశం

ప్రజాశక్తి- పుంగనూరు: వివిధ కారణాలతో మధ్యంతరంగా నిలిపివేసిన విద్యను పెంచుకోవడానికి ఓపెన్ స్కూల్ అందరికీ ఓ సువర్ణ అవకాశంగా ఉపయోగపడుతుందని రాష్ట్ర ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ అన్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ మండలస్థాయి సమావేశాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి విద్యార్హత లేకపోయినా 14 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్ష రాయవచ్చునన్నారు. బడి మానేసిన, అర్ధాంతరంగా చదువులు నిలిపేసిన వారికి ఇది ఒక సువర్ణ అవకాశం అన్నారు. అంతేకాకుండా వివిధ రంగాలలో పనిచేస్తున్న విద్యను పెంచుకోవడానికి ఓపెన్ స్కూల్ బాగా ఉపయోగపడుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలవారు ఈ అవకాశం ఉపయోగించుకొని విద్యాపరంగా అభివృద్ధి చెందాలని కోరారు. విద్య అవసరం అనుకున్న వారు 4వ తేదీ లోపు నమోదు చేసుకోవాలనిచెప్పారు. మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, రెడ్డన్నశెట్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నకిర్‌ఉల్లా ఖాన్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

'బెట్ట పరిస్థితులకు తగిన మందులు వాడాలి'

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బెట్ట పరిస్థితులకు తగిన మందులు వాడాలని మామిడి శాస్త్రవేత్తలు డాక్టర్ సంధ్యారాణి అన్నారు. గురువారం మండలం జయంతి గ్రామంలోని వ్యవసాయశాఖ అధికారి చిట్టిబాబు, ఉద్యానవన శాఖ అధికారి సాగరిక ఆధ్వర్యంలో చిన్నవీరమ్మ రైతు మామిడి పొలంను ఏరువాక కేంద్రం, చిత్తూరు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, తిరుపతి శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ జూన్, జులైనెలలో కురిసిన వర్షాలకు మామిడి పంటలో కొత్త చిగురు రావడం జరిగిందని, తరువాత బెట్ట పరిస్థితుల వలన కొత్తగా చిగురించిన ఆకులపైన తేనెమంచు పురుగు ఎక్కువగా ఆశించి రసంపీల్చడం వలన ఆకులు ముడుచుకొని గిడసబారి పోయాయని, దీనివలన ఆకులు కొమ్మలపై బంక కారడంతోపాటు మసి తెగులు ఆశించడం జరుగుతుందన్నారు. వెంటనే రైతులందరు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా అసిటామిప్రిడ్ 0.3 మి.లీ. ఏదో ఒక మందుతో పాటుగా కార్బెండజిమ్ 1గ్రా లీటరు నీటికి కలిపి చెట్టు మొత్తం తడిసేలా పిచికారీ చేసుకోవాలని తెలిపారు. సర్పంచ్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు డాక్టర్ వజంతా నాగమణి, చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మని, వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న, చిత్తూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమా, వ్యవసాయ విస్తరణాధికారి సాదరయ్య, రైతు సేవ కేంద్రం సిబ్బంది చంద్రిక, మామిడి రైతులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి - ఐరాల: ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడ వెలగపూడి సచివాలయంలో మంత్రి ఛాంబర్‌లో బీసీ.జనార్ధన్ రెడ్డి కలిసి దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా పూతలపట్టు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఇందులో ముఖ్యంగా యాదమరి – గుడియాత్తం రహదారి నిర్మాణంకు సహాయ సహకారం అందించాలని కోరారు. దాదాపు 10 కోట్ల రూపాయల అంచనాతో రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందని, చిత్తూరు – తమిళనాడుకు ప్రధాన మార్గం కావడంతో తరచూ వాహనాలు రాకపోకలు అధికంగా సాగుతుందని, ఈ క్రమంలోనే రహదారి గుంత మయం కావడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారని వేంటనే రహదారి నిర్మాణంపై తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే వాటిపై నిర్ణయం తీసుకుంటామని, వాటి అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని ఎమ్మెల్యేకు మంత్రి హామీ ఇచ్చారు.

'గురుకుల'లో మద్యం తాగిన ఉపాధ్యాయుడు

సోషల్ మీడియాలో హల్చల్

ఉన్నతాధికారుల విచారణ



ప్రజాశక్తి- శాంతిపురం: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పవిత్రమైన ఉపాధ్యాయ వృతిలో ఉంటూ, పాఠశాలలో అందులోనూ చదువుకుంటున్న విద్యార్థులను పక్కన కూర్చోబెట్టుకొని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల పిఈటి టీచర్ మద్యం తాగిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సమాచారం తెలుసుకున్న ఉన్నతాధికారులు గురువారం గురుకుల పాఠశాలలో విచారణ చేపట్టి సంబంధిత పిటి టీచర్, అతనికి సహకరిస్తున్న వాచ్మెన్లను విధుల నుండి తొలగించారు.

మాతాశిశు మరణాల నివారణకు

ప్రత్యేక ప్రణాళిక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి ఆధ్వర్యంలో గురువారం జిల్లాలో గత జూలైనెల 2024 జరిగిన మాత మరణం, 9 శిశుమరణాలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం ఒకటి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో జరిగిన మాత మరణంపై, 8 పిహెచ్‌సిల పరిధిలో 9 శిశుమరణాలపై సమీక్షించారు. ఈసమీక్షలో డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కేసుల వారీగా వైద్యాధికారి, పర్యవేక్షకులు, ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతో ముఖాముఖిగా చర్చించి భవిష్యత్తులో మాతాశిశు మరణాలు జరగకుండా నివారణ చర్యలలో కచ్చితత్వంతో కూడిన ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకుని సేవలు చేయాలని ఆదేశించారు.

పూతలపట్టు సీఐగా కృష్ణమనోహర్



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు సీఐగా కృష్ణ మనోహర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పలమనేరు రూరల్‌లో పనిచేస్తున్న ఈయన విఆర్‌కు బదిలీ అయ్యారు. అనంతరం పూతలపట్టుకు వచ్చారు. పూతలపట్టులో పనిచేస్తున్న సిఐ సుదర్శన ప్రసాద్ విఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సిఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా యువత పక్కదారి పడుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టనున్నట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రత్యేక కసరత్తు నిర్వహించినట్లు వివరించారు.

సీఐగా శ్రీనివాసులు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బంగారుపాళ్యం ఆప్‌గ్రేడ్ సిఐగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. కల్లూరు నుంచి బదిలీపై బంగారుపాళ్యం సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమ మద్యం విక్రయం, మట్కా జూదాలు ఘర్షణలకు తావు లేకుండా శాంతిభద్రతలను అమలు చేస్తామని అన్నారు. గ్రామంలో నూతన వ్యక్తులు సంచరించినప్పుడు వారి సమాచాంం అందించాలని ఫ్రెండ్లీ పోలీసులుగా ఉండేందుకు ప్రజలు ఆసక్తి చూపాలన్నారు.

పెద్ద ఉప్పరపల్లెలో తనిఖీలు

ప్రజాశక్తి- సోమల: మండలం పెద్దఉప్పరపల్లె గ్రామంలోని పలు ప్రథమ చికిత్స కేంద్రాలు, మెడికల్ షాపులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాలాజీ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రథమ చికిత్స కేంద్రాలు కేవలం తమ కేంద్రాలకు వచ్చే రోగులకు ప్రథమ చికిత్స చేయాలే తప్ప సెలైన్ పెట్టడం యాంటీబయాటిక్స్ ఇవ్వడం చేయరాదని నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. మెడికల్ షాపులందు లూజ్ సేల్స్ ఇవ్వరాదని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా లు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎంపి



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో కూడా రాణించాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పేర్కొన్నారు. గురువారం ఉదయం జిల్లా క్రీడ మైదానంలో జిల్లా క్రీడల అధికారి బాలాజీ, జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, రాష్ట్ర వాలీబాల్ వైస్ ఛైర్మన్ జయప్రకాష్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డిలతో కలసి స్థానిక జిల్లా క్రీడాసాధికారత సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బాలబాలికలు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు చదువుల్లో బాగా రాణించాలంటే శారీరక దృఢత్వం ఉండాలని అందుకు క్రీడలలో పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర క్రీడాసంస్థల ద్వారా జిల్లాకు అవసరమైన కోచ్‌లను తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిత్తూరు జిల్లాకు సంబంధించిన క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొని, జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. జిల్లాలో క్రీడలకు అవసరమైన సదుపాయాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో గెలుపొందిన బాలబాలికలకు, క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలకు జ్ఞాపికను మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు పీఈటీలు, పీడీలు, వివిధ పాఠశాలల బాలబాలికలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ఎస్ఐ రాజుకుమార్ అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి విచ్చేసిన ఎస్ఐ మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తిని పెంపొందుచుకోవాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధిలో క్రీడా ఆవస్యకత ఎంతో అవసరం ఉందని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి, అధ్యాపకులు బాలసుబ్రమణ్యం, ధనుంజయరెడ్డి, లత, సుబ్బారావు, హరిబాబు, భార్గవి, మీనా, రాజశేఖర్, విశ్వనాధరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి

బంగారుపాళ్యం: మండలంలోని పివిఆర్ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల, మంగళపల్లి ఉన్నత పాఠశాలలో హాకీ మాంత్రికుడు ధ్యాన్ చందు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఏపీఎంఎఫ్ ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని కాపాడండి

కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- గుడిపల్లి: ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు నక్కనపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని నక్కనపల్లి గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 62లో 15 ఎకరాలు ప్రభుత్వ భూమ గుండ్ల సాగరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అక్రమంగా తప్పుడు పాసు బుక్కులు తీసుకొని తమదంటూ దౌర్జన్యం చేస్తున్నారని, పదేపదే స్థానిక రెవిన్యూ అధికారులకు తెలియజేసిన తూతు మంత్రంగా వారిపై చర్యలు తీసుకుంటూ వదిలేస్తున్నారని తెలిపారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కి తమ సమస్యను తెలిపి అర్జీ అందజేసినట్లు తెలిపారు. కలెక్టర్ తక్షణమే దీనిపై చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

పోలీసులకు ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పోలీసుల సమస్యలు పరిష్కరించేలా జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీస్ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖలో సిబ్బంది బదిలీలు, సస్పెన్షన్ రీఓక్, సరెండర్ లీవ్, ఇంక్రిమెంట్లు, ఇతర అనేక సమస్యలపై పిటీషన్లు ఎస్పీకి అందించారు. ఈసందర్భంగా ఎస్పీ సిబ్బంది సమస్యలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులను వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే సస్పెన్షన్ రీఓక్, ఇంక్రిమెంట్లు వంటి అంశాల్లో, ప్రతి సిబ్బందికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే సిబ్బందికి బదిలీల ప్రక్రియను చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది వ్యక్తిగత సమస్యలను తెలుసుకున్న ఎస్పీ సర్వీస్ రూల్స్ ప్రకారం సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, సిబ్బంది న్యాయపరమైన సమస్యలను సరైన పద్ధతిలో పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీస్ శాఖలో సిబ్బంది హక్కులను కాపాడడం ప్రాధాన్యతగా ఉంటుందని, ఈ సమస్యలు త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. ఏఓ మోహన్ రావు, దస్తగిరి సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ ప్రత్యేక గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

బదిలీలకు దరఖాస్తు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఓ పుల్లయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం ఉదయం డిఆర్‌ఓ సమావేశం హాల్‌లో డ్వామా పిడి ఎన్.రాజశేఖర్‌తో కలసి పంచాయతీ రాజ్, సాంఘిక సంక్షేమం, జిల్లా మహిళ సంక్షేమం, మున్సిపాలిటీ, భూరికార్డ్స్ సర్వే, విద్యుత్, అధికారులతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బదిలీలపై తీసుకోవలసిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా బదిలీల కోసం దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని, వీరి దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. జిల్లాలో మొత్తం 1724 మంది అందులో మెడికల్ గ్రౌండ్స్ కింద 114 మంది, మ్యూచువల్ కోసం 183 మంది, చిన్న పిల్లల మెంటలీ పేరెంట్స్ 9 మంది, జేబుల్స్ పేరంట్స్ 32 మంది, మిగిలినవన్నీ రిక్వెస్ట్ బదిలీల కోసం ధర ఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సంబంధించిన కార్యాలయాల్లో బదిలీల ప్రక్రియ నిర్వహించాలని, కౌన్సిలింగ్‌కు ఆలస్యంగా వచ్చిన వారికి కూడా కౌన్సిలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించాలని, బదిలీలలో ఎలాంటి చిన్న పొరపాటుకు తావులేకుండా బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశం కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, డిఎల్‌డిఓ రవి కుమార్, పంచాయతీ రాజ్, సాంఘిక సంక్షేమం, మున్సిపాలిటీ, భూ రికార్డ్స్ సర్వే, విద్యుత్, జిల్లా మహిళ శిశు సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

యాదమరి ఉన్నత పాఠశాలకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ స్పోర్ట్స్ అవార్డు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: యాదమరిలోని పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ సంవత్సరం స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ స్పోర్ట్స్ అవార్డును సాధించింది. ఈ అవార్డును చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుచే పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, హరికృష్ణ, దాము అందుకున్నారు. పాఠశాల నుండి జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ప్రాతినిధ్యం వహించటం, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో వివిధ క్రీడాంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకుగాను ఈ అవార్డును అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ అవార్డు సాధించడం పట్ల చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు ప్రధానోపాధ్యాయులను వ్యాయామ ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.



అవార్డును అందిస్తున్న ఎంపీ ప్రసాదరావు

బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం : ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలోని ఎస్టేట్లో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు తన వంతు కృషి చేస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు హామీ ఇచ్చి తన ఉదారతను చాటుకున్నారు. గురుకుల పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్ బాల్ స్టేడియం పరిశీలించి కొంతసేపు పిల్లలతో సరదాగా బాస్కెట్ బాల్ ఆడారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక వసతులపై ఎంపీ ఆరా తీశారు. దీంతో అధ్యాపకబృందం పాఠశాలలో కాంపౌండ్ వాల్‌తోపాటు టాయిలెట్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన ఎంపీ ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసి తనకు పంపాలని ప్రతిపాదన అందిన వెంటనే నిధులు సమకూరుస్తానని హామీ ఇచ్చారు.

క్రైం న్యూస్

చోరీ నిందితులు అరెస్ట్

బంగారు వెండి స్వాధీనం



చోరీ నిందితులను చూపుతున్న డిఎస్పి సాయినాథ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పట్టణంలో దొంగతనానికి పాల్పడిన డిల్లి, ఉత్తరప్రదేశ్ కి చెందిన అంతరాష్ట్ర దొంగలు నసీన్ అభి, జంషీర్ పఠాన్‌లను అరెస్టు చేసి వారి నుండి దొంగిలించబడిన రూ. 8,50,000లు విలువ కలిగిన 140 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి ఆభరణాలు చిత్తూరు వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 15వ తేదీ చిత్తూరు పట్టణంలో కట్టమంచిలో నివాసముంటున్న మునిక్రిష్ణ అనే వ్యక్తి ఇంటి తలుపులు పగలగొట్టి బంగారు, వెండి నగలు, నగదు దొంగలించిన సంఘటనపై చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్‌పి. మణికంఠ చందోలు పర్యవేక్షణలో, డిఎస్‌పి సాయినాథ్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ ఎం.జయరామయ్య నేతృత్వంలో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లక్ష్మీకాంత్ ఇతర సిబ్బందితో బృందాలుగా ఏర్పడి డిల్లి, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్ర ప్రాంతాలలో ముమ్మర దర్యాప్తు చేసి ఇద్దరు అంతరాష్ట్ర దొంగలు అరెస్టు చేశారు. దొంగల ముఠా నుంచి దొంగలించబడిన రూ.8,50,000లవిలువ కలిగిన 140 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మరో ముద్దాయి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో సదరు దొంగల అంతరాష్ట్ర దొంగలు తాళం వేసివున్న ఇళ్ళను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల కొత్తపేటవీధికి చెందిన సాంబయ్య కుమారుడు మోహన్ కుమార్ (23) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. మోహన్ కుమార్ దురలవాట్లకు బానిస కావడంతో తల్లిదండ్రులు మందలించగా ఇంటిలోనే ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

మోహన్ కుమార్ కుటుంబ సభ్యులకు పరామర్శ



మోహన్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి, మిధున్ రెడ్డి

మండల కేంద్రమైన సోమల దిగువవీధి కొత్తపేటలో గురువారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్న మోహన్ కుమార్ తల్లిదండ్రులు సాంబయ్య, ఎల్లమ్మలను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గురువారం సాయంత్రం మృతుడి ఇంటి వద్ద పరామర్శించి వారిని ఓదార్చారు. అధైర్యపడవద్దని తాము అన్నివేళలా అందుబాటులో ఉండి ఎలాంటి సహాయ సహకారాలు అయినా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్, నాగేశ్వరరావు ,వైస్ ఎంపీపీ ప్రభాకర్, మాజీ సర్పంచి శ్రీరాములు, సీనియర్ నాయకులు వెంకటరమణ, చంద్రమౌళి వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఒక వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలైన సంఘటన గురువారం మండలంలోని కేజీ సత్రం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు యాదమూరు మండలం బలిజేపల్లి ఎస్టీ కాలనీ చెందిన చిన్నప్ప కుమారుడు రవి ద్విచక్ర వాహనంలో చిత్తూరు నుండి కేజీ సత్రం గ్రామం వద్ద మలుపు తిప్పుతుండగా పలమనేరు నుండి చిత్తూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో రవికి తీవ్ర గాయాలకు 108లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి- కార్వేటినగరం: అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ఆర్కేవీబీ పేట గ్రామ సమీపంలోని చింపిరి కాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన రహస్య సమాచార మేరకు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి అదే గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను ఇసుకతో పాటు స్టేషన్‌కు తరలించి సీజ్ చేయడం జరిగిందన్నారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక, గ్రావెల్, మట్టి వంటివి తరలిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలం కురివికుప్పం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో గురువారం ఎస్ఐ వెంకట సుబ్బయ్య తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారుగా 1000 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

రామచంద్రారెడ్డి మృతి తీరని లోటు

కళత్తూరు నారాయణ స్వామి

ప్రజాశక్తి కార్వేటినగరం: వైఎస్సార్సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి మారుసాని కుటుంబ సభ్యులు ఎంతో కృషి చేశారని, రామచంద్రారెడ్డి(65) అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడు రుణపడి ఉంటుందని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ లోకనాధరెడ్డి సోదరుడు, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ ఆయన వెంట ఉన్నారు.

సక్కు బాయమ్మ మృతికి నివాళులు

ప్రజాశక్తి- విజయపురం: పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయ యాదవ్ తల్లి సక్కు బాయమ్మ మృతికి గురువారం చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, టీడీపీ మండల అధ్యక్షులు రమేష్ రాజు, చిన్నబ్బరాజు, సుధాకర్ రాజు, దశరథరాజు, మురళీ, మహేంద్ర నివాళులు అర్పించారు.